# దీపశిఖ

అందరూ వెళ్ళినట్లుగానే మేంకూడా ఒకసారి అమెరికా వెళ్ళి వచ్చాం. కాకపోతే ఇక్కడ విశేషం ఏమిటంటే మా జట్టుకు మా అత్తగారు లీడరు. ఏదో ఒక బలహీన క్షణంలో మా ఆయన ఆవిడకి 'మనవ రాలికాపురం చూపిస్తాన'ని వాగ్దానం చేశారట. అందు వలన మేం ముగ్గురం అక్కడికి వెళ్ళడం సాధ్యమయింది.

అప్పటికి మా అమ్మాయి అక్కడికి వెళ్ళి పది ఏళ్ళ యింది. చక్కదనాల మనవరాలు పుట్టి రెండేళ్ళయింది. ఈలోపల అక్కడ ఎన్ని విశేషాలు జరిగినా, మమ్మల్ని రమ్మని వాళ్ళు ఎంత బ్రతిమిలాడినా మా పెద్దమనిషి ససేమిరా అన డంతో వెళ్ళడం పడలేదు. చివరికి మా అత్తగారికిచ్చిన వాగ్దానం నిలబెట్టుకోవడం కోసం పాపం ఆయన ఒడబడ్డారు.

అప్పు-ఆస్తీ అన్నీ అప్పచెప్పి, సరిగ్గా ఆరువారాల తర్వాత తిరిగి వచ్చేసేందుకు రిటర్న్ జర్నీ టిక్కెట్లు ఖరారు చేసుకున్నాక బయల్దేరాం. ఎటువంటి ఇబ్బం దులు పడకుండా వాషింగ్టను నగరంలో దిగేటప్పటికి సాయంత్రం అయింది. ఇల్లు చేరేటప్పటికి రాత్రి తొమ్మి దయింది. ఇల్లు చేరి లైట్లేయగానే ''ఇలా లైట్లు గుడ్డి వెలుతురిస్తున్నాయేమిటే'' అని నా కామెంటు వినగానే మా అమ్మాయికి కోపం వచ్చి అతిథిని కదా అన్న మర్యా దన్నా చూపకుండా సామానక్కడ పడేసిపోయింది. పాపం మిగిలిన అతిథి మర్యాదలన్నీ మా అల్లుడే చేశాడు.

ఏం చెయ్యను! వెలుతురు తక్కువగా వుంటే నాకు నా చిన్నప్పుడు కిరసనాయిలు దీపాల వెలుతురున్న అమ్మమ్మవాళ్ళ ఇల్లు గాపకం వచ్చి మనసంతా దిగులు దిగులుగా అయిపోతుంది. అందుకనే మా ఇంట్లో ఎప్పుడూ అన్ని ట్యూబ్‌లైట్లు ఫుల్‌గా వేసి వుంచుతా. ఇంక అప్పటికీ ఇరవైనాలుగ్గంటల నించీ విమానాల అమ్మా యిలు చేసిన రకరకాల మర్యాదలతో విసిగెత్తిపోయున్నా నేమో, కనీసం కాఫీ అన్నా తాగకుండా నిద్రపోయాను.

తెల్లవారి కళ్ళు తెరిచి చూసేటప్పటికి దాని కూతు ర్నెత్తుకుని నా కూతురు. ఏ తల్లికన్నా ఇంతకన్నా కన్నుల పండుగ చేసే దృశ్యం ఏముంటుంది? గోడకేసి చూస్తే టైము ఎనిమిదిన్నర చూపిస్తోంది. ''ఇంకా నాలుగు పక్కలా తెల్లారినట్లే లేదు! అప్పుడే ఎనిమిదిన్నరేవిటే?'' అని పలకరించా!

''మా ఊళ్ళో పదిన్నరయినా ఇంతే తెల్లారుతుందిలే! ఇప్పుడింక ఈ ఊళ్ళో సూర్యుడిని తిట్టిపోస్తావా? లేలే! నిద్రపోయేందుకా ఇంతదూరం వచ్చావు?'' అని పాపాయ్‌ని నా మంచంమీద కూలేసి వెళ్ళిపోయింది.

కాసేపు పాపాయితో ఆడుకుని దాన్నెత్తుకుని నెమ్మదిగా హాల్లోకి వచ్చాను. మా అత్తగారు డైనింగు టేబిల్ దగ్గర కూచుని దానిమీదున్న నీళ్ళ జగ్గుని చూస్తూ తనకి కంఠోపాఠం అయిన అష్టాదశ అష్టకాల్లో ఒకదాన్ని చదువుతున్నారు.

''అదేవిటీ! అలా జగ్గుకేసి చూస్తూ ఆ పారాయణం ఏమిటి? శైలువడిని ఏదైనా దేవుడి పటం పెట్టుకోక పోయారా?'' అనడిగాను.

'మా ఇంట్లో మనుషుల గురించి కొత్తగా తెలుసు కోవలసిందేవుందిలే' అని నిట్టూర్చి మా ఆయనెక్కడు న్నారు చెప్మా అని అటూ ఇటూ చూశాను. ఎక్కడా కని పించకపోయేటప్పటికి కిటికీలోంచి బయటకు చూశాను. ఎంచక్కా మా ఊళ్ళో మాలీకి మల్లేనే ఓ మఫ్లరూ, టోపీ పెట్టుకుని, పాత స్వెట్టరు (బహుశా మా అల్లుడిదేమో) వేసుకుని రెండు బస్తాల గడ్డి మేటేస్తున్నారు. ఆహా! దేశ కాల వాతావరణ పరిస్థితులతో సంబంధం లేకుండా ఏదో ఒక పనిని కనిపెట్టి చేసుకుపోగల ధీరోదాత్తులం కదా అని ఒక్కక్షణం నా మనసు పులకరించిపోయింది.

చంటిది నేను దానికేసి చూసినపుడల్లా 'నో! నో!' అని అరుస్తూ, నేను చూడనపుడు దానిలోకంలో అది ఆడుకుంటోంది. ఇంక నాకు ఏవిటో ఆక్సిజను తక్కు వయినట్లు, ఊపిరిరాడనట్లు, ఉక్కవుక్కగా, వేడిగా అని పించసాగింది. పొద్దున్నే హాయిగా వుండాల్సి వుండగా ఇలా అనీజీగా వుందేవిటి? మరి మా ఆయన ఈ మఫ్లరూ స్వెట్టరూ స్టైలేవిటబ్బా? ఇక్కడ అలా వేసుకోవాలని ఎవరైనా చెప్పారేమో! ఒకసారి పలకరించివద్దాం. లేకపోతే కూతురింటికి వచ్చాక తనని మర్చిపోయానని అలిగినా అలుగుతారు మహానుభావులు!

బయటకెడదామని అద్దాల వీధి తలుపు తీశాను! కొట్టిందీ హిందీ సినిమాలో దయ్యం మ్యూజిక్‌తో సహా మొహం మీదకి చల్లటి గాలి. ఒక్కసారి వళ్ళంతా చచ్చు పడ్డట్లయిపోయింది. అప్పుడు తట్టింది నా మొద్దు

సోమరాజు సుశీల

బుర్రకి. ఇల్లంతా ఎయిర్ కండిషండ్ కాబట్టి వెచ్చగా వుంది గానీ ఆ వెచ్చదనం సహజమయినది కాదు అని. షూస్, సాక్సూ, స్వెట్టరూ వేసుకుని గానీ బయటకు అడుగుపెట్టలేకపోయాను. ఇలా ఇరవైనాలుగ్గంటలూ ఎయిర్‌కండిషనర్ సాయంతో గడపాలంటే వీటిని నివాసయోగ్యమైన ఊళ్ళు కావు అని మన పూర్వీకులే తేల్చివేసే వారు కదా! ఆఫ్‌కోర్సు! కరెంటు సప్లై చేయలేక ఇప్పటి ప్రభుత్వాలు వంత పడేవనుకోండి!

ఆదివారం కదా ఎటైనా వెళ్ళచ్చు అని చెప్పి ఉప్మాచేసి బల్లమీద పెట్టి వంట ప్రయత్నంలో పడ్డాను. క్యాప్సికం తరిగి పోపులో వేసి దాని మొహాన నువ్వులపొడి చల్లనా, ఉల్లిఖారం పెట్టనా అని చాలా సీరియస్‌గా ఆలోచించు కుంటూ ఎదురుగావున్న మా అమ్మాయిని ఎరక్కపోయి అడిగాను.

''ఓ పనోటి చెయ్యి! ముందు వుల్లిఖారం పెట్టి కాసేపాగి నువ్వుల్ల పొడి వేసేయ్! ఎవరికి ఇష్టమైంది వాళ్ళు ఊహించుకుంటార''ని బ్రహ్మాండమైన సలహా ఇచ్చింది.

ఇంతట్లోకీ పెరటి గుమ్మంలోంచి ''హాయ్ మామ్! వాట్సీ కుకింగ్? దిసీజ్ కారెన్'' అంటూ మాటవినిపించింది. వెనక్కి తిరిగి చూశాను. ఆరడుగుల పొడగరి. అమెరికన్ ఆదివారపు సంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోతోంది. కళ్ళు తిప్పుకోలేనంత చక్కనిది. నన్ను చూడగానే చేయందించింది.

గులాబీ రంగు తామర పువ్వుల్లా వున్నాయి చేతులు ''నైస్ మీటింగ్ యూ కారెన్'' అని అంటూ తనని డైనింగ్ టేబిల్ దగ్గిరికి తీసుకెళ్ళాను. మా అత్తగారిని పరిచయం చేశాను. ''ఈ పిల్లనాకెందుకు తెలియదూ! ''నీకేం కావాలో చెప్పవే అమ్మా! అని మనం మనమ్మాయికి ఫోన్ చేస్తే 'కారెన్‌కి గాజులు తీసుఉరా, కారెన్‌కి చున్నీలు తీసుకురా, కారెన్‌కి జీడిపప్పు పాకం తీసుకురా'' అని ఆర్డర్లేస్తూ దిగా! ఈ అమ్మాయ్‌కేనన్న మాట. పిల్లబాగుందీ!'' అంటూ కాంప్లిమెంటిచ్చారు.

తన పిల్లలెలాగున్నారని పంక్తులలో కుశల ప్రశ్నలేశారు. వస్తారని తనూ సంజ్ఞలతో సమాధానమిచ్చింది. అక్కడ అత్తగారూ, మా అమ్మాయీ, అల్లుడూ టిఫిన్లు అంటుంటే తనూ వాళ్ళతో కూచుని ఒక్కొక్క స్పూను ఉప్మా తింటూ కబుర్లలో పడిపోయింది.

''చూశావా మా పక్కింటి పిన్నిగార్ని'' అని అటు మా అమ్మాయి నవ్వడం మొదలుపెట్టింది. 'ఇంత చక్కని పిల్లని పట్టుకుని పిన్నిగారంటావేమిటే పల్లదనానికయినా హద్దుండాలి. అని అచ్చ తెనుగులో కేకలేశాను.

''పిన్నిగారి హోదాకీ చక్కదనానికీ సంబంధం లేదులే. నాలుగురోజులాగితే నీకే తెలుస్తుందిలే నేనా పేరు ఎందుకు పెట్టానో! అయినా పక్కింటి పిన్నిగారన్నాను గానీ పక్కింటి లావుపాటి పిన్నిగారనలేదుగా'' అని మళ్ళీ నవ్వసాగింది.

ఇంక ఆ డైనింగు టేబిలుమీద డేరా వేసిన వాళ్ళు ఏవేళ్టికీ కదలరు! ఈలోగా నేను వంట

## అడవి

చంద్రుడున్నాడనీ
ప్రతినెలా నిండువెన్నెల విసురుతున్నాడనీ
తెలిసింది నాకు
నా జుత్తు వెండిలా మెరిసాకే!

ఒక్కనెలా ఆరుబయట డాబామీద
పండువెన్నెలను నిండు కౌగిలిలో
బంధించి మత్తుగా ముద్దిడలేదని
నాకు తెలిసింది
నా కండలలో చైతన్యం జారిపోయిన తర్వాతే!

ఒక్క వెన్నెల రాత్రీత
రాత్రంతా చందురుడిని
నా కణికణంలో బంధించి
అమృతత్వం పొందలేదని
నాకు తెలిసింది
నా కళ్ళ ఆవేశాల పొరలన్నీ జారిపోయాకే!

ఒక్క పూర్ణిమా
నా గుండెలమీద
తన మెత్తని వెన్నెల ముద్దలు రుద్ది
నన్నేవో లోకాలకి తీసుకుపోలేదని
నాకు తెలిసింది
నా హృదయం ఎండిపోయాకే!
మీరు మాత్రం వెన్నెలను జారిపోనివ్వకండి
మీరు మాత్రం నాలా చందురిడిని వదిలెయ్యకండి!

డా॥ మోపిదేవి విజయగోపాల్

చేయడం స్నానం చేయడం కూడా అయిపోయాయి.

ఇంక అప్పుడు వచ్చారు వాళ్ళమ్మని ఇంటికి తీసుకెళ్ళడానికి. ఒక రెండేళ్ళపాప, అయిదేళ్ళ పాప ఆ వెనక ఆ పిల్లల తండ్రీ వాళ్ళింటికీ మన ఇంటికీ మధ్య ఓ కాంపౌండ్ వాల్ గానీ, ఓ దడిగానీ లేవు. అమెరికాలో చాలా ఇళ్ళకి అంతేనని తరవాత తెలిసిందనుకో!

వాళ్ళ వంటింటి నుంచి మన వంటింటి దాకా చక్కని టైల్సు పరిచిన నడకదారుంది. వాటి మీద పిల్లలు పరిగెడుతూనే వుంటారు. బెల్లు నొక్కడమూ, మే ఐ కమిన్ అని అడగడమూ లాంటి మర్యాదలేమీ వాళ్ళు పాటిస్తున్నట్లు లేరు.

కారెన్ భర్త పేరు 'ఎడ్' అట. ఎంత బాగున్నాడో! అచ్చు మన హిందీ సినిమా హీరో అమీర్ ఖానల్లే వంచిగా మర్యాదగా వున్నాడు. ఇంటికి రమ్మని పిల్లలు పేచీ పెట్టడంతో తప్పని పరిస్థితుల్లో బయలుదేరింది.

అప్పుడు మా అమ్మాయి "అమ్మా! నీకు తను ఓ డీల్ పెడుతోంది. నువ్వుగానీ రోజూ నువ్వు చేసే కూరని తనకి పెడితే నిన్ను తనకి వీలైనపుడు రెండుగంటలు వూరంతా తిప్పుతుందిట. నీకిష్టమయితే చెప్పు!" అంది.

అదేదో బాగానే వుంది అనిపించి సరేనన్నాను. ఎందుకంటే మా అల్లుడికీ అమ్మాయికీ శనాదివారాలు తప్ప ఇంకెప్పుడూ బయటికి తీసికెళ్ళడం కుదరదు మరి. వెంటనే థ్యాంక్యూ అంటూ గట్టుమీద వున్న క్యాప్సికమ్ కూరలో 3వ వంతుని బౌల్‌లో పెట్టుకుని 'రేపు పదిగంటలకి రెడీగా వుండు! నాకు 1.30 పని వుంది అని చెప్పి "బాయ్ డాడ్!" అంటూ మా ఆయనకో ఫ్లైయింగ్ కిస్ విసిరేసి నాకేసి చూసి కన్నుగీటుతూ వెళ్ళిపోయింది.

సిగ్గుపడి తలొంచుకున్న మా ఆయన్ని చూస్తే జాలేసింది పాపం. "ఇప్పుడర్థమయిందా నేనా పేరెందుకు పెట్టానో! ఇంకా ముందు ముందు ఎన్ని వేషాలేస్తుందో చూడు! ఆ ఎడ్ చేత ఇంట్లో ఎద్దు చాకిరీ చేయిస్తుంది. ఇదేమో ఊరంతా తిరుగుతుంటుంది" అని మా అమ్మాయి అంది.

"ఏమో! నాకేమీ అర్థంకావటల్లా! ఇక్కడేదే చాలా ఫార్మాలిటీస్ పాటించాలీ అమెరికన్లతో ముక్తసరిగా మర్యాదగా వుండాలని బోలెడు మెంటల్ ప్రిపరేషనుతో వచ్చా. తీరా చూస్తే ఈ అమ్మాయి మన అమలాపురం నుంచో అవనిగడ్డ నుంచో వచ్చినట్లు ఇంత సరదాగా వుందంటే నమ్మలేక పోతున్నా"నన్నాను.

"మనుషులెక్కడయినా ఒకటేనమ్మా! కొంచెం పద్ధతులు తేడాలుంటాయంతే! నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుందని నువ్వేగా చెప్తావు! మనిషికీ మనిషికీ స్నేహం కుదరాలంటే దేశమాతలేం అడ్డుపెట్టరు. మేమే మహానుభావులం. మిగతా అందరూ జారులూ చోరులూ అనుకుంటేనే ప్రమాదం" అని ఆ అమెరికా భక్తురాలు నాకొక ఉపన్యాసం దంచింది.

"మరి మనదేశంలో పాములూ సాములూమ్లా తప్ప ఇంకేమీ వుండవని ఇక్కడి వాళ్ళనుకో వచ్చేం!" అని నేననగానే నాకొక నమస్కారం పెట్టి

## కవితావిర్భావం

ఆర్తి నుండి భయభ్రాంతి నుండి
అనుభూతి కవ్విత జీవన క్రాంతి నుండి
నిర్వేదం నివురుగప్పిన నిప్పావ జ్వలన నుండి
గాఢాంధకారపు లోతుల
మెరసి విరసిన మనోదీప్తి నుండి
గగన చుంబిత ఆశాపాశ ఉద్దీపన భాతి నుండి
మనసు మాలిన్యాన్ని కడిగేసి వడబోసిన
స్వచ్ఛజలాల కాంతి నుండి
సుప్రభాత పూపరిమళాల వెల్లివిరిసిన
ఆనందాతిశయం నుండి
అందం నిర్వచనాన్ని బంధించి భలా అనిపించే
కుందనపు బొమ్మల సౌందర్యాతిశయపు సొంపు
నుండి
ప్రకృతి వైపరీత్యపు ప్రళయ భీభత్సం నుండి
విశ్వవ్యాపిత వైవిధ్యపు మూలాలను
అన్వేషించే తపనలో
సృష్టి వైభవశోభ ఎదనింపిన
ఆధ్యాత్మిక భావనల అలజడిలో
హరివిల్లులా వర్షపుజల్లులా
మయూర నృత్యంలా కమనీయ దృశ్యంలా
మానవతావేదంలా మహనీయ కావ్యంలా
కవిత పలుకుతుంది కలకాలం నిలుస్తుంది

*గణపతిరాజు నరసింహరాజు*

మా అమ్మాయి వాళ్ళ నాన్నతో సహా గార్డెన్లోకి వెళ్ళిపోయింది.

ఇంకో గంట తర్వాత వాళ్ళయననీ పిల్లల్నీ కార్లో కూచోబెట్టి టాటా చెప్పేసి మళ్ళీ మా పెరట్లో ప్రత్యక్ష మయింది కారెన్. ఈసారి ఇంట్లో దాకా రాకుండా అక్కడే మా ఆయనకి గార్డె నింగు క్లాసులు మొదలు పెట్టింది. మొత్తం గార్డెను పరికరాలెలా వాడాలో చూపించింది.

బండి లాగుతూ గడ్డి ఎలా కోయాలో సగం గడ్డి కట్ చేసి చూపించింది. వాళ్ళిద్దరికీ మంచి స్నేహం కుదిరి నట్లుంది. మధ్య మధ్యలో చెట్టుకిందున్న గార్డెన్ టేబిల్ మీదున్న బౌల్‌లోంచి కాప్సికమ్ కూరా తింటూ కోక్ తాగుతూ ఒకటే కబుర్లు. కాసేపు కిటికీలోంచి చూసి లోపలికొచ్చేశాం.

అప్పుడప్పుడే చలి కాలం వెళ్ళి వసంత ఋతువు ప్రవేశిస్తోంది కదా! ఇంక ఆర్నెల్లవరకూ రకరకాల పూల మొక్కలు పెంచుకోవడమే అందరి పనీ! ఆదివారం కాబట్టి అందరిళ్ళల్లో పిల్లలూ పెద్దలూ ఏదో ఓ ఆయుధం పుచ్చుకుని గార్డెన్లల్లోనే. అంటే అంతా క్లీన్ చేసుకోవడం గడ్డి ట్రిమ్ చేసుకోవడం, స్విమ్మింగ్ పూల్‌ని బాగుచేసు కోవడం ఒకటేవిటీ ప్రతి ఇంటి ముందూ పెద్దా చిన్నా ఆడా మగా తేడా లేకుండా వాళ్ళ ఇంటి పనులు వాళ్ళు చేసుకోవడం ఒక అద్భుత దృశ్యంలా కనిపించింది నాకు.

మనకిక్కడ సగం జీవితం పనిమనిషి రాలేదనో, చాకలి బట్టలు తేలేదనో బాధ పడడానికే సరిపోతుంది.

నెమ్మది నెమ్మదిగా ఆ వాతావరణానికి, ఒక్క పూట వంటచేసి రెండు పూటలా తినడానికీ, ఇంగ్లీషు ఛానెల్స్‌లో సీరి యల్స్‌కీ, పగలంతా పిట్టల చప్పుళ్ళు మాత్రమే విన డానికీ అలవాటు పడడం మొదలుపెట్టాం. ప్రామిస్ చేసి నట్లుగానే కారెన్ రోజు విడిచిరోజు పదిన్నరకి వచ్చి నన్ను తన కారులో ఎక్కిం చుకుని ఊరంతా తిప్పేది.

ఒక్కొక్కసారి మా అత్త గారు కూడా నాతో వచ్చే వారు. ఒక్క ఇరవై మైళ్ళు ఊరు బయటకు వెళ్ళా మంటే ఎన్ని సెలయేళ్ళు, పచ్చికబయళ్ళు,లోయలు చూడటానికి రెండు కళ్ళూ సరిపోయేవి కావు.

అది అంత పెద్ద పట్టణ మయినా జనసమర్ధం అంతగా లేనిచోట జింకలు లేళ్ళు కనిపించేవి. ఒకరోజు కాలనీ చూపిస్తానని తీసి కెళ్ళింది. ఒక్కొక్క ఇంటి ముందు నిలబెట్టి ఆ ఇల్లు ఎప్పుడు కట్టారో, ఆ ఇల్లు ఇప్పటికి ఎన్ని చేతులు మారిందో దాని ఆర్కి టెక్చరు ఏ దేశానిదో చెప్పి ఆ వాకిట్లో వున్న చెట్టుకి ఎన్నేళ్ళో అది ఎక్కడిదో ఆ చెట్టు బొటానికల్‌గా ఏ జాతికి చెందిందో చెప్పేది. ఇంటికి రాగానే లాప్‌టాప్ ఓపెన్ చేసి వెబ్‌సైట్ లోంచి మొత్తం సమాచారమంతా చూపించేది. ఇంక నా అదృష్టం కొద్దీ ఒక పిట్లో, పురుగో, తుమ్మెదో, కందిరీగో కనిపించినా అదే కథ.

అసలు ఈ పిల్లకి ఈ ప్రపంచంలో వున్న ఎనభై కోట్ల

## సరికొత్త 'మీడియ'ం

క్షణానికో రంగు... నిముషానికో న్యూసెన్స్
మొదలయింది 24 గంటల గారడి...
సంస్కృతి పోతుందంటూనే...
సంప్రదాయానికి ఉప్పుపాతర...
అప్రమత్తుల్ని చేస్తున్నామంటూనే
పోటీమత్తులో మునుగుతూ...
జరగాల్సిన నష్టం జరిగాక నేరం ఘోరం అంటూ ఫోకస్
అయినవాళ్ళకు బంగారునజరానాలు...!
కాని వాళ్ళకు నిఘాకళ్ళ సత్కారాలు...!!
ఐతే అద్భుతమైన కవరేజి... కాకపోతే కోలుకోలేని డామేజీ...
మెరగైన సమాజం కోసం కొండ తవ్వి ఎలుకను పడుతూ
కాకులను కొట్టి గ్రద్దలకేస్తున్న వైనం...
మూఢవిశ్వాసాలను ఎండగడుతూ కథనాలు...
రాళ్ళే దేవుళ్ళు రత్నాలను ధరించండంటూ ఆవెంటే ప్రకటనలు...
తాము చేస్తే శృంగారం... జనం చేస్తే వ్యభిచారం...
నొసటితో వెక్కిరించడం... నోటితో తెగపొగడటం...
అశ్లీలంపై పరుషవ్యాఖ్యలు...
ఆ దృశ్యాలకే హెడ్‌లైన్స్‌లో స్థానాలు...
అన్నింటా మూడోనేత్రం దాడి... రేటింగ్‌ల కోసం దిగజారుడికి రెడీ...
ఇది సరికొత్త ''మీడియ''ం సంగతులు...

*ఆరిపాక ప్రభాకర్*

జీవరాశుల మీదా అంత ఇంటరెస్టేమిటో నాకు అర్థం అయ్యేదికాదు. ఒకసారి వాళ్ళ అమ్మగారింటికి తీసి కెళ్ళింది. అదే కాలనీలో వాళ్ళ మేనమామలవి, దారిలో వాళ్ళ అత్తలవి అందరూ అక్కడక్కడే మూడు తరాల బంధువుల ఇళ్ళు చూపించింది. తను పుట్టిన హాస్పిటలు, చదువుకున్న స్కూళ్ళు కాలేజి, పెళ్ళయిన చర్చి, తన మొట్టమొదటి బాయ్‌ఫ్రెండు ఇల్లు, తను ఎడ్‌ని కలుసుకున్న రెస్టారెంటు. అన్నీ చూపించింది. ఇవన్నీ చూస్తే నాకు మన అగ్రహారాలు గుర్తొచ్చాయి.

మర్నాడు వాళ్ళ అత్తగారి ఇంటివేపుకి దాడి. వాళ్ళ ఇల్లు ఊరికి చాలా దూరంగా ఇంకో కాలనీ. దారిలో మాకొక చిన్నసైజు అడివీ, సెలయేళ్ళు కూడా కనిపించాయి. వాళ్ళ ఇంట్లోఅత్తగారిదే పెత్తనంట. మామగారు చాలామంచివారుట (అందరిళ్ళల్లోలాగానే).

తన చరిత్ర లాగానే వాళ్ళాయనది కూడా చరిత్ర అంతా ఇల్లస్ట్రేషన్స్‌తో సహా చెప్పింది. ఈ అమ్మాయి చెప్పినట్లుగానే వాళ్ళ అత్తగారు ముక్తసరిగా హాయ్ అని పలకరించి లేసు అల్లుకుంటూ కూచుంది. తను మాత్రం ఇల్లంతా చూపించి దొడ్లో వున్న టమాటాలు, బీన్సు, సిమ్లా మిర్చి కోసి పెద్ద బుట్టల వేసుకుని, ఫ్రిజ్‌లో వున్న కేకు సగం కోసి పీస్ చేసుకుని 'బాయ్ మామ్' అని చెప్పి బయలుదేరింది. మరి దేశం ఏదయినా తను ఆ ఇంటి కోడలు కదా! అన్ని హక్కులూ వుంటాయి మరి.

(ఇలా తన పుణ్యామా అని ఆ చుట్టుపక్కల కాలనీలు, మామూలు టూరిస్టులు చూడని ఎన్నో అనామకపు ప్రదేశాలు, నిజమైన అమెరికన్ కుటుంబాలు వాళ్ళ జీవితాలు, సమస్యలు, భయాలు అన్నీ చూడగలిగాను. నాకు అసలు ఏ దేశమెళ్ళినా అక్కడ చెట్లు మనుష్యులు అంటేనే ఇష్టం. చారిత్రక కట్టడాలని కంప్యూటర్లో అయినా చూసుకోవచ్చు కదా!)

❖ ❖ ❖

నాకన్నిటికన్నా నచ్చిన విషయమేమిటంటే చుట్టాలన బడే వాళ్ళు అక్కడా ఇలాగే వుంటారు. ఏద వేశమైనా ఫ్రెండ్సే మంచివాళ్ళు. ఫ్రెండ్షిప్‌లో మాటలనడం, వినడం పడడం వుండవు కదా! మంచి కుటుంబాలన్నిటిలో ఆడవాళ్ళ మాటే చెల్లుతుంది. భర్తలు భార్యలని చూసి కాస్త భయపడుతుంటారు. ఇళ్ళల్లో బోల్డు పనులు చేస్తారు. ఎక్కువసార్లు భార్య పుట్టింటికి సంతోషంగాను, అమ్మా నాన్నల దగ్గరకి అప్పుడప్పుడు బాధగాను వెడుతుంటారు. తల్లులు వయసొస్తున్న ఆడపిల్లల గురించి దిగులు పడుతుంటారు. ఆరాలు తీస్తుంటారు. బాయ్ ఫ్రెండ్స్‌ని కేకలేస్తూ వుంటారు. పిల్లల్ని పట్టుకోవడం కుదరదు. వదిలేయడం వల్లకాదు.

కారెన్ నన్ను ఎక్కడెక్కడికి తిప్పినా ఒంటిగంట వరకే. ఆ తరువాత తనకి పనుందని వెళ్ళిపోయేది. ఎట్టి పరిస్థితులలోను మధ్యాహ్నం పూట దొరికేది కాదు.

## కూర్మాన నానీలు

**చె**ప్పదలచుకున్నదేదో చెప్పు
మెటీరియల్ వుంటే
సెటైర్‌లు లేకున్నా
వింటారు జనం

కీర్తిలేరని
దాహం
నేటి ప్రపంచంలో
డబ్బుకి బాగానే
దొరుకుతుంది

గుండెలు చీల్చేలా
హాస్యమాడకు
నవ్వురాదు
రక్తం ఎగిసిపడుతుంది

ప్రేమ
నునువెచ్చని హాయి
వైరస్
సోకకుండా చూసుకో

రాజకీయాలు
రణరంగాన్ని గుర్తుచేస్తున్నాయి
కత్తులు నూరుతున్నారందరూ
కుత్తుకలు కోసుకోడానికి
ఓట్లు ఎరుపెక్కుతున్నాయి

ఆకాశం ఎత్తుగా వున్నా
దగ్గరగా వున్నట్టే అనిపిస్తుంది
నీతి న్యాయం అందుకునేలా వున్నా
అందవు సుమా!

కూర్మాన వెంకట సుబ్బారావు

''రోజూ ఎక్కడికి పోతుందే మధ్యాహ్నాలప్పుడూ?'' అని మా అమ్మాయినడిగితే 'దానికూరినిండా చుట్టాలే నీకు మల్లేనే' అని ఒక ఆదరా బాదరా జవాబిచ్చింది.

ఒక్కరోజు మాత్రం సాయంత్రం పూట వాళ్ళ ఊరెలా వుంటుందో చూపిస్తానని రెండు మూడు కాలనీలు తిప్పింది. అప్పుడప్పుడే పొద్దు గూకుతోంది. ప్రతి ఇంట్లోనూ గాజు అద్దాల కిటికీల వెనక కొవ్వొత్తుల్లా మినుకుమినుకుమని వెలిగే కరెంటు దీపాలననుసరించి వుంచారు. (మనం దీపావళినాడు గూట్లో దీపాలు పెడితే అక్కడ రోజూఅదే పనన్నమాట) ప్రతి ఇంట్లోంచీ ఆ దీపాలు వెలుగుతూ ఆరుతూ, ఎంతో దివ్యంగా కనిపిస్తూ చీకట్లో కూడా ఆ ఇంటి ఆకారాన్ని చక్కగా చూపిస్తున్నాయి.

తిరిగి ఇంటికి వచ్చాక మా అమ్మాయితో ''మీ ఊరు

## మౌనభాషణం

ఇన్నాళ్ళూ నువ్వూ నేనూ కలిసున్న ఈ ఇంట్లో
ఇప్పుడు నేనొక్కడినే వంటరిగా
రోజులు లెక్కిస్తూ గంటలు గడుపుతూ
వేకువలన్నీ వెలవెలబోతున్నాయి
ఎర్రగుత్తుల పూలూ ముద్దమందారాలూ
ప్రతినిత్యం నీకోసం రేకలు విప్పార్చుకుని చూస్తున్నాయి
భాషరాని వాటికి ప్రశ్నలున్నాయేమోగాని
మాటరాని నా మనసుకి సమాధానాలు మాత్రం లేవుకదా
ఎంత నిర్జీవమైన బ్రతుకు యిది
శరీరంలోంచి ఒక ముఖ్యాంగం తొలగిపోయినా
యింత బాధ వుండేది కాదు
కళ్ళలోని నీళ్ళన్నీ యింకిపోయినా
రక్తంలోని నీటిని కూడా పిండుకుంటూనే వున్నాయి
ధారలుగా కారే ఈ బాధంతా
ప్రేమో అభిమానమో స్వార్థమో మరోటో
నీకొక్కదానికే తెల్సు
నువ్వూ నువ్వులేని యీ ఇల్లు ఇల్లులా లేదు
ఇసుక యిటుకా సిమ్మెంటూతో చేసి అస్థిపంజరంలా వుంది
ఎన్ని దీపాలు వెలిగించినా అలుముకున్న అంధకారం పోదే!
మధ్యాహ్నం పోస్టులో నీపేర్న యింకా ఉత్తరాలు వస్తూనే వున్నాయి
సాయంకాలాలు ఇంటి ముంగిట్లో గుబాళించే ఫలసంపెంగలు
అందుకునే నీ చేతులకోసం ఎదురుచూసి చూసి
ఏదో అర్థమైనట్లు పూయడమే మానుకున్నాయి
అన్నట్టు చెప్పడం మరచాను
ప్రతినెలా ఠంచనుగా అడుక్కునేందుకు వచ్చే
కుష్టిరోగపు ముసిల్చి నీవులేవన్న వార్తవిని
'అయ్యోతల్లో' అంటూ నెత్తిన చెయ్యేసుకుని
వీధిలోని కాగుచెట్టుకింద కూలబడిపోయింది
ఆకాశంవంక చూస్తూ
అనాథల హృదయాలలో కూడా నువ్వెంత పదిలంగా
అపురూపంగా వున్నావో తెలిశాక గుండె చెమర్చింది
ప్రతిరాత్రీ భోజనాలవేళ పెరట్లోకి వచ్చే నల్లకుక్క కూడా
అన్నంముద్దకోసం కాక నీకోసమే అన్నట్లు
గాజుకళ్ళలాంటి కళ్ళతో బేలగా చూసి చూసి
చివరికి రావడమే మానుకుంది
నీ జ్ఞాపకాలతో యీ ఇల్లంతా నిండిపోయింది
అవి నా ఒంటరి బతుకును ఉక్కిరిబిక్కిరి చేసి
విలవిలలాడేట్టు చేస్తున్నాయి
మనిషీ మనిషీ పలకరించుకుంటూ వుండాలన్న నీమాట
పదే పదే గుర్తొస్తున్నా
యీ ఘనీభవించిన నిశ్శబ్దాన్ని
ఛేదించలేకపోతున్నాను
ఎంతమందిలో వున్నా నాలోని ఒంటరితనం
నా చుట్టూవున్న నిశ్శబ్దం, అంధకారం
నన్ను వదిలిపోవటంలేదు
ఏ తొలిపొద్దులోనో మలిసంధ్యలోనో
మెరుపులామెరిసి
నన్ను రారమ్మని పిలిచే నీ మృదుస్వరంకోసం
పరితపిస్తున్నాను
ఆ శుభఘడియకోసం నీళ్ళునిండిన కళ్ళతో
నిరంతరం ఎదురుచూస్తూనే వుంటాను

ఆ.వెం.సీ

## రక్తరుతువు

ఇప్పుడిక్కడ దారులన్న
నెత్తుటిధారల్ని చుంబిస్తున్నాయి
మత్తులో జోగుతూ
మరణానికి ఆహ్వానం పలుకుతున్నాయి
వాహన మధిరోహించగానే
ఆకాశంలో విహరిస్తున్నట్లు భ్రమ
ఉరుకుల పరుగుల జీవితం
అదుపు తప్పిన వాహనం
సవ్యమో అపసవ్యమో
లక్ష్యం చేరేందుకు చేసే అలక్ష్యమో
ఏదైతేనేం ప్రాణదీపం ఆరిపోయాక!
పరుగు పయనంలో ఎవరు ముందో ఎవరు వెనుకో
తేల్చుకునే లోపే ప్రాణవాయువు ఎగిరిపోతుంది
తనువేదైనా మృత్యుధర్మమొక్కటేగా!
క్షతగాత్రుల్ని చూసి
రోడ్డు కన్నీటి వరదవుతుంది
అన్నీ తారురోడ్లే
కానీ రూపాలు మాత్రం తారుమారు
క్షణంలో ప్రకృతి చిత్రం మారిపోతుంది
పోయేవారెవరైతేనేం గుండెకోత ఒకటే!
సన్నిహితుల నిస్సహాయ చూపులు
గుర్తు తెలియని వాహనం గుట్టుగా
మాయమవుతుంది
శవపంచాయిత్ సాధారణ ప్రక్రియ
ఆపరేషన్‌కు ఉపయోగించే సాధనాలు
కన్నవారి గుండెల్లో కరకర కలవరం సృష్టిస్తాయి
ఎక్స్‌గ్రేషియా ఓదార్పు తిరం నిమురుతుంది
పరామర్శలు-పలకరింపుల చిలకపలుకులు
గుండెలోని భారాన్ని తోడేస్తాయి
''దిక్కులేని వారికి దేవుడే దిక్కు
ఆ దేవుడెపుడు కనిపించడు అదే చిక్కు!''
ఎవరికి ఎవరు ఏమవుతారో
అంతుపట్టని రహస్యం
''అంతామిథ్య''-స్మశాన వైరాగ్యం
ఇప్పుడిక్కడ
రుతుధర్మాలు మారిపోయాయి
అంతా ఒకటే రుతువు-రక్తరుతువు!

సి.కామేశ్వరరావు

ఎంత బావుందే! ఏదో కలొచ్చినట్లుంది. కారెన్ అదృష్టం చూడు. అమీర్‌పేటలో అత్తారిల్లూ, చిక్కడపల్లిలో పుట్టిల్లూ హిమాయత్‌నగర్‌లో తన ఇల్లూ వున్నట్లున్నాయి. ప్రతి శనివారం కలుసుకుంటారటగా'' అన్నాను.

''ఆఁ కలుసుకుంటూను వుంటారు! మళ్ళీ కొట్టుకుంటూను వుంటారు. తనకి కొన్నాళ్ళు అమ్మతో పడదు. ఇంకొన్నాళ్ళు అత్తగారితో పడదు. చుట్టాలందరికీ గొడ్డు చాకిరీ చేసి ఏదో ఒకటి అని పడి పడుతుంటుంది'' అని తన ఫ్రెండు గురించి బాధపడింది.

''అయినవాళ్ళంతా ఒకే ఊళ్ళో వుంటే ఆ మాత్రం మాట తేడాలొస్తాయి మరి. ఏ అమ్మానాన్నలకయినా పిల్లలు కళ్ళముందుండాలంటే పెట్టి పుట్టాలి. ఏ తరంలోను మన వాళ్ళనుభవించని క్షోభ మా తరం తలిదండ్రులనుభవించాల్సి వస్తోంది. ఎదురుగా వుండి బాధలు పడుతుంటే చూడలేక ఎక్కడికో పోయి సుఖంగా బతకండి అని తోలేస్తున్నాం. ఈ పిల్లలూ అంతే ఐసరబజ్జా అనుకుని పోయినవాళ్ళు అదే పోత! పూర్వం మహాపరాదాలు చేసిన వాళ్ళకి దేశాంతర వాస శిక్ష వేసేవారుట. ఇప్పుడా శిక్ష అమ్మలే వేస్తున్నారు. పోనీలే మీరెవరూ పిల్లల్ని దూరాలు పంపుకోనక్కరలేదు! అమెరికా కన్నా డబ్బున్న దేశం వుండదు కదా''

ఏదో చదువుకుంటున్నది తలెత్తి నాకేసి చూసేటప్పటికి కోపంతో ఆ పుస్తకం నామీదకి గిరాటేస్తుందేమోనని భయం వేసి అప్పటికి నోరు మూసుకున్నాను.

ఒకరోజు రాత్రి భోజనాలయిపోయాక అందరం కూచుని ఏవో కబుర్లు చెప్పుకుంటుండగా ఫొటో ఆల్బంలు తెచ్చి నా ముందు పడేసింది మా అమ్మాయి. మా మనవరాలి మొదటి పుట్టినరోజు ఫొటోలు చూస్తున్నాం. చాలా ఫొటోల్లో కారెన్ నవ్వుతూ తన పిల్లలిద్దరితో నిలబడివుంది. కానీ ఆ అమ్మాయి తలమీద ఒక్క వెంట్రుకన్నా లేదు శరీరం, తలా ఒకే రంగులో నిగనిగలాడుతున్నాయి. ఒకవేళ అదీ ఒక ఫ్యాషనేమోననుకున్నాను.

''మా దేశంలో షబానా అజ్మీకి పట్టిన పిచ్చి ఇక్కడక్కూడా పాకిందేవిటే'' అని అడిగాను.

''ఫ్యాషనూ కాదు. ఏం కాదు. ఆమధ్య కీమోథెరపీ చేయించుకుందిలే! ఇపుడు బాగానే వుందిగా! నీకెందుకిన్ని ఆరాలు?''

''తను కీమోథెరపీ చేయించుకోడమేవిటీ?? అదేమన్నా బ్యూటీ ట్రీట్‌మెంటా? క్యాన్సరు పేషంట్సుక్కదా అది చేసేది?'' అప్పటికే నా గొంతు మనసు కళ్ళు

కంట్రోలు తప్పుతున్నాయి.

"ఇదుగో! ఇలా గొడవెడతావనే నీకు చెప్పలేదు! దాని రెండో కూతురు పుట్టినప్పుడు పాలివ్వబోతే తెలిసింది. ఒక్క నెలతేడాతో రెండు బ్రెస్ట్లూ ఆపరేషను చేసి తీసే శారు. ఏడాదిపాటు రకరకాల ట్రీట్‌మెంట్లిచ్చారు. ఇప్పుడంతా తగ్గిపోయి అందరిలా నార్మల్‌గా వుంది. కాకపోతే మూడునెలలకోసారి చెకప్‌కి వెడుతుంది. ఆ ఉపద్రవాన్ని మొగుడూ పెళ్ళాలెంత ధైర్యంగా ఎదుర్కున్నారో.

మనదేశంలో అయితే తెలిసికొంతా తెలియకకొంతా చేయవలసిన పనులు చేయకుండా నానాగోలా చేసుకుంటారు. ఇద్దరు పిల్లల్ని చూసుకుంటూ ఆ ట్రీట్‌మెంటంతా తీసుకుంది. నువ్వడిగేదానివిగా రోజూ ఎక్కడికి పోతుందని? క్యాన్సరు పేషెంట్సుకి కౌన్సిలింగ్ చేస్తుంది. టర్మినల్ పేషంట్సుకి వెళ్ళి కబుర్లు చెప్పి సేవలు చేస్తుంది. వారానికి రెండు రోజులు ఆర్ఫనేజిలోపనిచేస్తుంది. స్వయంగా తను అంత నాజూకు పరిస్థితిలో వుండికూడా ఇంకొకరికోసం చేతనయినంత సహాయం చేస్తుంది. నువ్వు హైదరాబాదులో కూచుని ఇక్కడి వాళ్ళ గురించి తేలికగా మాట్లాడేదానివి. మంచివాళ్ళెక్కడైనా వుంటారు.

"ఊఁ సర్లే ప్రతిదానికి నన్ననడం నీకలవాటయిపోయింది. ఇక్కడందరూ చెడ్డవాళ్ళని నేనెప్పుడన్నాను!"

"ఇదిగో అమ్మా చెప్తున్నాను. తనతో ఈ విషయం ఎత్తకు. ఇన్నాళ్ళూ ఎలా వున్నావో ఇప్పుడూ అలాగే వుండు. లేనిపోని జాలి చూపించి తనని బాధపెట్టకు. అమ్మమ్మ చెప్పేది కాదూ 'అయ్యో పాపం అనకండే! అరవైవేల పాపాలొస్తాయనీ! అంత పెద్ద ఉపద్రవాన్నుంచి బయటపడి ఆరోగ్యంగా తిని తిరుగుతూ తనలాంటివాళ్లకి ఇంకో పదిమందికి సహాయం చేసిపెట్టే ఆ అమ్మాయి గురించి భయంకరంగా ఊహించుకుని బుర్రపాడు చేసుకోకుండా నిద్రపో! గుడ్‌నైట్" అని మా అమ్మాయి దాని గదిలోకి వెళ్ళిపోయింది.

నిజమే కదా! జీవించడానికి పోరాటం చేస్తూ కూడా పదిమందికీ సంతోషాన్ని పంచుతున్న మంచి వ్యక్తి గురించి అనవసరపు బెంగలు పెట్టుకునే అధికారం నాకెవరిచ్చారు? తలక్రిందులు చేసినా తలెత్తుకుని లోకానికి వెలుగునిచ్చే దీపశిఖకు దణ్ణంపెట్టుకున్నాను. ■

## విలువలు

అక్షరాల బాటపట్టి
విద్యలెన్ని నేర్చినా
నమ్మిన ఒక విద్యలోన
అక్షరమై నిలచిపో
ఆనందం విరబూసే
ఆటలెన్ని ఆడినా
దివ్యమైన ఒక ఆటలో
నేర్పరివై వెలిగిపో
పసందైన పలుకులెన్ని
నీవు పలుకనేర్చినా
నీ పలుకే విశ్వమంత
కొలిచేలా చూసుకో
మనుగడకే ఎన్నిపనులు
నీవుచేయ నేర్చినా
నీతినియతి మార్గములో
ఆర్జించుట నేర్చుకో

*రేగులపాటి కిషన్‌రావు*

## ఆదిత్య హృదయం

నా హృదయం ఆదిత్య హృదయమే
నన్ను నమ్ముకొన్నవాళ్ళకు
ఎన్నెన్నో అమృతఫలాలను ఇస్తుంది
నా హృదయం జయావహమే
చెలిమిచేసే వారిలో
వైరాన్ని రూపుమాపుతుంది
నా హృదయం అక్షరమే
నవ్య కవితాక్షరమాలికల్ని ప్రసవిస్తుంది
నా హృదయం పరమశివమే
అర్ధభాగం అనురాగానికి అంకితమౌతుంది
నా హృదయం దివ్యధామమే
నడచివచ్చే దేవతలకు ఆతిథ్యమిస్తుంది
నా హృదయం విశాలవిశ్వమే
నవనవలాడే తారకలకూ
అవిరళంగా వెలిగే చంద్రునికీ
విహరించే చోటు ఇస్తుంది
నిత్యం స్నేహ పరిమళాలతో విరబూస్తుంది!

*డా॥ అయాచితం నటేశ్వరశర్మ*